
సాక్షి
గుంటూరు
ఆదివారం । 19 । జనవరి । 2025




వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు

మాచర్ల: పట్టణంలో బస్టాండ్ సెంటర్‌లో గల వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం అడిగొప్పల చెన్నకేశవాచార్యులు అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శనివారం 1818 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 92, బ్యాంక్ కెనాల్‌కు 144 వదిలారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 561.10 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 9,800 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

తెనాలి-గుంటూరు నాన్‌స్టాప్ సేవలు పునఃప్రారంభం



తెనాలి అర్బన్: తెనాలి-గుంటూరు నాన్‌స్టాప్ బస్సు సర్వీసులను పునఃప్రారంభించినట్లు ఆర్టీసీ తెనాలి డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ పేర్కొన్నారు. బస్సు సర్వీసులను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి 9.30 గంటల వరకు సర్వీసు ఉంటుందన్నారు. ప్రతి 30 నిమిషాలకు ఒక బస్సును ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ప్రసాద్, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ శ్రీనివాసరావు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ వ్యక్తిగత పనుల కోసం వారం రోజులు సెలవు పెట్టారు. ఆదివారం నుంచి ఈఎన్‌టీ ప్రొఫెసర్ డాక్టర్ ఉప్పాల శ్రీనివాసరావును ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది.

లక్ష్మీ నరసింహస్వామికి రూ. 55,78,843 ఆదాయం



మంగళగిరి (తాడేపల్లి రూరల్): మంగళగిరిలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం ఎగువ సన్నిధి, దిగువ సన్నిధి, శ్రీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం హుండీల లెక్కింపును శనివారం లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ ఆవరణలో లెక్కించారు. మొత్తం ఆదాయం రూ. 55,78,843 వచ్చిందని ఆలయ కార్యనిర్వహణాధికారి రామకోటిరెడ్డి వెల్లడించారు. ఇందులో లక్ష్మీ నరసింహస్వామి దేవస్థాన ఎగువ సన్నిధిలో రూ. 24,87,319, దిగువ సన్నిధిలో రూ. 29,93,901, శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో రూ. 62,250, అన్నదాన సత్రంలోని హుండీ ద్వారా రూ. 33,373 వచ్చినట్లు ఆయన తెలిపారు. గతంలో కంటే ఈ ఏడాది రూ. 5,71,509 అధికంగా వచ్చిందని పేర్కొన్నారు. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని శ్రీ సహస్ర లింగేశ్వరస్వామి దేవస్థానం, పొన్నూరు కార్యనిర్వహణాధికారి జి. వెంకట అమర్ పర్యవేక్షించారు.

జీజీహెచ్‌లో కాలేయ మార్పిడి ఆపరేషన్లు




గుంటూరు మెడికల్ : గుంటూరు జీజీహెచ్‌లో కాలేయ మార్పిడి ఆపరేషన్లు చేసేందుకు బ్రెయిన్ డెడ్ కేసులకు అనుమతి మంజూరు చేస్తూ జీవన్‌ధాన్ ట్రస్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు శనివారం జీవన్‌ధాన్ ట్రస్టు అందజేసిన సర్టిఫికెట్‌ను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాధిపతి డాక్టర్ అనుమల కవితకు అందజేశారు.

ముందస్తుగా పేర్లు నమోదు చేసుకోవాలి

జీజీహెచ్‌లో కాలేయ మార్పిడి ఆపరేషన్లు చేయించుకోవాలనుకునేవారు ముందస్తుగా పేర్లు నమోదు చేసుకోవాలి.ఆ తర్వాత వెయిటింగ్ లిస్టు ప్రకారం ఆపరేషన్లు చేసేందుకు జీజీహెచ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు రంగం సిద్ధం చేస్తారు. కాలేయ మార్పిడి ఆపరేషన్లు చేసేందుకు ఇప్పటికే ఇద్దరి రోగులను గుర్తించామని గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాధిపతి డాక్టర్ అనుమల కవిత తెలిపారు. త్వరలోనే ఆపరేషన్లు చేస్తామని చెప్పారు.

కంపెనీ సెక్రటరీ ఆఫ్ అమరావతి చాప్టర్ ఛైర్మన్‌గా నాగరాజు



నెహ్రూనగర్: ఇనిస్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీ ఆఫ్ అమరావతి చాప్టర్ ఛైర్మన్‌గా నారంశెట్టి వెంకట శివ నాగరాజు ఎన్నికయ్యారు. ఈ మేరకు అమరావతి చాప్టర్ తెలిపింది. ఇటీవల జరిగిన కార్యవర్గ సమావేశంలో అమరావతి చాప్టర్ వైస్ ఛైర్మన్‌గా పి.వి.ఎస్.ఆర్. సిద్ధార్థ, సెక్రటరీగా మహమ్మద్ అబ్బాస్ సయ్యద్, కోశాధికారిగా శివరాం ప్రసాద్, కార్యవర్గ సభ్యులుగా కే విజయ్ కుమార్, ఎస్. శివరామకృష్ణ, శ్రీనివాసరావు తదితరులు ఎన్నికయ్యారు.



ప్రొఫెసర్లతో 1975 బ్యాచ్ వైద్య విద్యార్థులు

లైఫ్ is బ్యూటిఫుల్

- ఉత్సాహంగా గుంటూరు వైద్య కళాశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం
- వైభవంగా స్వర్ణోత్సవం

గుంటూరు మెడికల్: ఆనాటి ఆ స్నేహం మధురాతి మధురం అంటూ కాలేజీ రోజులను వైద్యులు నెమరువేసుకున్నారు. తరగతి గదుల్లో కూర్చుని 50 ఏళ్ల వెనక్కి వెళ్లిపోయారు. యవ్వనంలో చేసిన అల్లరిని జ్ఞప్తికి తెచ్చుకుని పులకించిపోయారు. నాటి చిలిపి పనులు, కొంటె చేష్టలు ఒక్కొక్కటిగా గుర్తుచేసుకుంటూ 60 ఏళ్లు దాటిన వృద్ధులంతా కుర్రకారుగా మారిపోయారు. వైద్య వృత్తిలో నిత్యం బిజీగా ఉంటూ దేశ విదేశాల్లో స్థిరపడిన సీనియర్ వైద్యులంతా రీ యూనియన్ పేరుతో శనివారం గుంటూరు వైద్య కళాశాలలో కలుసుకున్నారు. కళాశాలలో చేరి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా గోల్డెన్ జూబ్లీ పేరుతో పూర్వ వైద్య విద్యార్థులు, సీనియర్ వైద్యులు ఒకచోటకు చేరుకుని జ్ఞాపకాలను పంచుకున్నారు. వైద్య కళాశాల జింఖానా ఆడిటోరియంలో 50 ఏళ్ల ప్రయాణం గురించి వివరించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు.

85 మంది సీనియర్ వైద్యులు రాక

గుంటూరు వైద్య కళాశాలలో 1975 బ్యాచ్ వైద్య విద్యార్థులు 135 మంది ఉండగా, వారిలో 85 మంది శనివారం జరిగిన గోల్డెన్ జూబ్లీ రీయూనియన్ వేడుకలకు హాజరయ్యారు. అమెరికా, ఆస్ట్రేలియా, ఇతర విదేశాల్లో ఉన్నవారు, దేశంలోని పలు రాష్ట్రాల్లో పేరు ప్రఖ్యాతలు గడించిన వైద్యులంతా సమ్మేళనానికి హాజరై సంతోషాన్ని పంచుకున్నారు. గుంటూరు వైద్య కళాశాలలో 1975 బ్యాచ్‌కు ఓ ప్రత్యేకత ఉంది. ఒకే ఏడాది రెండు ఎంబీబీఎస్ బ్యాచ్‌లు వైద్య కళాశాలలో చేరడం 1975 బ్యాచ్ ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. ఎంబీబీఎస్‌లో చేరేందుకు వయస్సుపై ఉన్న అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ 1974 బ్యాచ్ కోర్టుకు వెళ్లడంతో వారు 1975లో నవంబరులో ఎంబీబీఎస్‌లో చేరారు. వీరితోపాటు రెగ్యులర్‌గా 1975 బ్యాచ్ వారు ఫిబ్రవరిలో వైద్య కళాశాలలో చేరారు. ఈ విధంగా ఒకే ఏడాది రెండు ఎంబీబీఎస్ బ్యాచ్‌లు చేరిన బ్యాచ్‌గా 1975 బ్యాచ్ గుర్తింపు తెచ్చుకుంది. ఫిబ్రవరి బ్యాచ్ శనివారం రీయూనియన్ పేరుతో హాజరు కాగా, నవంబరు చేరిన బ్యాచ్ ఆదివారం గోల్డెన్ జూబ్లీ రీయూనియన్ పేరుతో హాజరు కానుంది.

గురువులకు సన్మానం

సీనియర్ ఫిజీషియన్ డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి, సీనియర్ ఈఎన్‌టీ సర్జన్ డాక్టర్ ఫణీంద్రకుమార్, ఎస్‌పీఎంకు చెందిన డాక్టర్ శివరామ్‌ప్రసాద్, ఫిజియాలజీకి చెందిన డాక్టర్ ఇందిరాదేవి, డాక్టర్ నాగేశ్వరరావులను 1975 బ్యాచ్ వైద్య విద్యార్థులు ఘనంగా సన్మానించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగార్జునకొండ వెంకటసుందరాచారి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ కార్యక్రమానికి హాజరయ్యారు. పూర్వ వైద్య విద్యార్థులు కళాశాల అభివృద్ధికి జింఖానా పేరుతో చేస్తున్న సేవలను కొనియాడారు. రీయూనియన్ పేరుతో వస్తున్న వారంతా గుర్తుగా వైద్య కళాశాలకు, జీజీహెచ్‌కు సాయం చేయాలని కోరారు. రీ యూనియన్‌కు ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ విజయభాస్కర్ కన్వీనర్‌గా, డాక్టర్ తేజానంద్ గౌతమ్, డాక్టర్ చక్రపాణి, డాక్టర్ వెంకటేశ్వరరావు, డాక్టర్ శివకుమార్, డాక్టర్ రామకృష్ణ కోర్ కమిటీ సభ్యులుగా వ్యవహరించారు. రీ యూనియన్‌కు హాజరైన వైద్యులలో 65 నుంచి 67 సంవత్సరాల మధ్య వారే ఉన్నారు. వయస్సు పైబడుతున్నా ఉత్సాహంగా వేడుకలకు హాజరై అందరిని ఆశ్చర్యానికి గురి చేశారు.



స్మార్ట్ ఫోన్లతో గుట్టు రట్టు

- వ్యక్తిగత గోప్యతకు పెను సవాలుగా మారిన స్మార్ట్ ఫోన్ల వినియోగం
- కొంప ముంచుతున్న డిజిటల్ సైకాలజీ
- చూసే వీడియోలు, చేసే పోస్టులతో వినియోగదారుల మానసికస్థితి అంచనా
- ఖాతాదారుల యూఆర్‌ఎల్స్ అమ్మేస్తున్న బ్లాగర్స్
- సమాచారంతోనే రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు

- గుంటూరు నగరం పాత గుంటూరు ప్రాంతానికి చెందిన శ్రీను అనే యువకుడు నిత్యం ఫేస్‌బుక్ అధికంగా చూస్తుంటాడు. ఈ క్రమంలో కొద్ది రోజుల కిందట ఫేస్‌బుక్‌లో యువతి పరిచయమైంది. తనది ఏలూరని..అక్కడకు రావాలని చెప్పడంతో ఆమెను కలిసేందుకు వెళ్లాడు. తన మొబైల్‌కు లోకేషన్ పెట్టింది. తీరా చూస్తే ఆ ప్రాంతమంతా ఊరికి చివరన ఉంది. అక్కడకు వెళ్లిన శ్రీను దగ్గరకు కొందరు వ్యక్తులు వచ్చి.. తమ ఆడపిల్లలకు మేసేజ్‌లు చేస్తావా? అంటూ బెదిరించి ఉన్న డబ్బులు లాక్కుని వెళ్లిపోయారు.
- అరండల్‌పేటకు చెందిన ఒక యువతి ఇన్‌స్టాగామ్‌ను అధికంగా ఉద్యోగవకాశాల కోసం చూస్తుంటుంది. దీనిని ఆసరా చేసుకున్న సైబర్ నేరగాళ్లు ఆమెకు మాయమాటలు చెప్పారు. ఉద్యోగం ఆర్డర్ కాపీ కూడా నకిలీది పంపి, రూ 6లక్షల వరకు దోచుకున్నారు.



పట్నంబజారు : ఓ వ్యక్తి నుంచి అతను వాడుతున్న స్మార్ట్‌ఫోన్ తీసుకుని, ఓ పది నిమిషాలు సోషల్ మీడియాలో వచ్చే వీడియోలు చూస్తే ఆలోచనా విధానం, మానసిక స్థితిని ఇట్టే చెప్పేయవచ్చని మానసిక వైద్యులు చెబుతున్నారు. స్మార్ట్‌ఫోన్ వినియోగంలో అప్రమత్తంగా లేకపోతే భవిష్యత్తులో ఎన్నో అనర్థాలను చవిచూడాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు. స్మార్ట్‌ఫోన్ వినియోగంలో మెలకువలు తెలియని వ్యక్తులు వాటికి దూరంగా ఉండడమే మేలని సూచిస్తున్నారు. లేనిపక్షంలో గుట్టుగా ఉన్న వ్యక్తిగత గోప్యతకు సంబంధించిన అంశాలు ఇట్టే రట్టవుతాయని హెచ్చరిస్తున్నారు.

ప్రజల భద్రతకు పెను సవాల్

స్మార్ట్ ఫోన్ వినియోగిస్తున్న ప్రతి వ్యక్తిపై సోషల్ మీడియా అల్గారిథమ్ పెత్తనం చెలాయిస్తోంది. అత్యధికంగా సోషల్ మీడియా ప్లాట్‌ఫారాల్లో సమయం గడుపుతున్న ప్రజల భద్రతకు ఇది పెను సవాల్‌గా మారింది. సాంకేతికత పెరిగిన ప్రస్తుత రోజుల్లో అత్యధికంగా జరుగుతున్న సైబర్ నేరాలకు సోషల్ మీడియా అల్గారిథమ్ సహాయకారిగా పని చేస్తోందని పలువురు నిపుణులు చెబుతున్నారు. స్మార్ట్ ఫోన్ వినియోగిస్తున్న వ్యక్తి ఆలోచన సరళి (డిజిటల్ సైకాలజీ)ని ఈ అల్గారిథమ్ పూర్తిగా బట్టబయలు చేస్తోందని హెచ్చరిస్తున్నారు.

అల్గారిథమ్ మ్యాపింగ్

సోషల్ మీడియా ప్లాట్‌ఫారాల్లో అత్యధికంగా వినియోగంలో ఉన్న యూట్యూబ్, ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగామ్, లింక్డ్ ఇన్ తదితర యాప్‌లు వ్యక్తిగత గోప్యతను పూర్తిగా హరిస్తున్నాయి. ఫేస్‌బుక్, యూట్యూబ్, ఎక్స్(ట్విట్టర్), ఇన్‌స్టాగామ్, లింక్డ్‌ఇన్ పని తీరులో భాగంగా సెర్చ్ ఇంజిన్‌కు అనుసంధానంగా అల్గారిథమ్ మ్యాపింగ్ పని చేస్తుంది. వ్యక్తుల మానసిక స్థితి, ఆలోచన విధానం, అవసరాలు, అవసరం లేని అంశాలు, ఇష్టాలు, అయిష్టాలు, నడక, నడవడిక, చేసే వృత్తి, నిబద్ధత తదితర అంశాలను ఓ ప్రత్యేకమైన మ్యాపింగ్ ద్వారా అల్గారిథమ్ వందకు వంద శాతం పసిగడుతూ ఉంటుంది. వ్యవసాయ సంబంధిత ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగాలకు కొనసాగించే సెర్చ్‌లు, కామెడీ వీడియోలు, మీమ్స్, వంటలు, అశ్లీల వీడియోలు తదితర అంశాలన్నీ అల్గారిథమ్ ఇచ్చే సమాచారంతోనే స్మార్ట్‌ఫోన్‌లకు చేరుకుంటాయి.

సైబర్ నేరాలకు ఆస్కారం

ఇటీవల పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన కొన్ని బ్లాగ్‌లు, వ్యక్తుల సోషల్ మీడియా అకౌంట్‌తోనే వ్యాపారం సాగిస్తున్నాయని సైబర్ పోలీసులు నిర్ధారించారు. వ్యక్తుల మానసిక స్థితి ఆధారంగా ఫిల్టర్ చేసిన సోషల్ మీడియా యూఆర్‌ఎల్స్ (యూనిఫాం రీసోర్స్ లోకేటర్)ను సైబర్ నేరగాళ్లకు బ్లాగర్లు అడ్డగోలుగా విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఉద్యోగం కోసం వెతికే వ్యక్తుల సమాచారంతో కూడిన యూఆర్‌ఎల్స్‌ను కొనుగోలు చేసిన సైబర్ నేరగాళ్లు వారి ఫేస్‌బుక్, ఇన్‌స్టా ఖాతా లింక్‌లు పరిశీలిస్తూ ఫేక్ నోటిఫికేషన్లు పంపిస్తున్నారు. ఉద్యోగాల ఆశ చూపి దోపిడీకి తెరలేపుతున్నారు. తక్కువ ధరకే వ్యవసాయ పరికరాలు అమ్మేస్తామని రైతులను, ట్రేడింగ్ లాభాలు చూపిస్తామని ఇన్వెస్టర్‌లను, రుణాలు ఇప్పిస్తామంటూ డబ్బు అవసరం ఉన్న వారిని ప్రలోభాలకు గురి చేసి దోచేస్తున్నారు. ఈ తరహా మోసాల నుంచి బయట పడాలంటే స్మార్ట్ ఫోన్‌ల వినియోగంపై పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత



కలెక్టరేట్ ఆవరణలో చీపురుతో చెత్తను శుభ్రం చేస్తున్న జేసీ

జేసీ భార్గవ్ తేజ

గుంటూరు వెస్ట్: పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటే దేశం మొత్తం సుందరంగా ఉంటుందని జాయింట్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ తెలిపారు. స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక కలెక్టరేట్ ఆవరణలో జేసీతో పాటు అధికారులు చీపురుపట్టి కలెక్టరేట్ ప్రాంగణంలోని చెత్తా చెదారాలను ఊడ్చి శుభ్రం చేశారు. మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రతి నెలా మూడో శనివారం గ్రామ స్థాయి నుంచి నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమం ప్రతి నెలా ఒక ప్రత్యేకమైన థీమ్‌తో 12 నెలలు కొనసాగుతుందని తెలిపారు. ప్రపంచం మారుతోందని, దీనికి తగ్గట్లు మనం కూడా ముందుకు సాగాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ శుభ్రతకు అధిక ప్రాధాన్యతనివ్వాలని కోరారు. చెత్తా చెదారాలు రోడ్లపై ఎక్కడబడితే అక్కడ వేయొద్దని కోరారు. స్వచ్ఛంద సంస్థలు, ప్రైవేటు సంస్థలు దీనిపై దృష్టి సారించాలని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో ఖాజావలి, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, డీఎస్‌ఓ కోమలి పద్మ, డీపీఓ నాగ సాయి కుమార్, ఐసీడీఎస్ ఉమాదేవి, సీపీఓ శేషశ్రీ, జిల్లా రిజిస్ట్రార్ డి.శైలజ, జిల్లా వ్యవసాయాధికారి నున్న వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయకపోతే ఉద్యమం

రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్ రెడ్డి

తాడేపల్లి రూరల్ : ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం రైతు సంఘం కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. రైతు సంఘం అధ్యక్షుడు వి. కృష్ణయ్య అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ అన్నదాన సుఖీభవ పథకం కింద రూ. 20 వేలను రైతుల ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. పెట్టుబడి సాయం అమలులో రాష్ట్ర ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని విమర్శించారు. ఎన్నికల హామీలు అమలు చేయకపోతే రైతు సంఘాలు, రైతుల కోసం పనిచేస్తున్న గ్రామీణ సంస్థలను కలుపుకుని రాష్ట్ర బంద్ చేస్తామని తెలిపారు. నాడు స్మార్ట్ మీటర్ల విధానాన్ని వ్యతిరేకించిన టీడీపీ నేడు అధికారంలోకి వచ్చిన వెంటనే దాన్ని కొనసాగిస్తోందని తెలిపారు. ఉచిత పంటల బీమా అమలు చేయాలని, ట్రూ అప్ చార్జీలను వెంటనే రద్దు చేయాలని, వెనుకబడిన ప్రాంతాల సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. విజన్- 2047 పేరుతో చంద్రబాబు అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో వివిధ జిల్లాల నుంచి రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శులు, రైతులు పాల్గొన్నారు.

26న తెలుగు నాటక రంగం- స్త్రీవాదంపై జాతీయ సదస్సు



వివరాలు వెల్లడిస్తున్న ముత్తవరపు సురేష్‌బాబు

యడ్లపాడు: సాహితీరంగ ప్రముఖులు, తెలుగు నాటకరంగ ఉద్దండులతో సాహిత్య సదస్సును ఏర్పాటు చేస్తున్నట్లు ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల వేదిక(తెలుగు నాటక పరిషత్తుల సమ్మేళన) అధ్యక్షుడు ముత్తవరపు సురేష్ బాబు తెలిపారు. శనివారం యడ్లపాడులోని ఆయన నివాసంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర సాహిత్య అకాడమీ, వేదిక సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీన యడ్లపాడులో సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 'తెలుగు నాటకం - స్త్రీవాదం' అనే అంశాలపై రెండు విభాగాల్లో సదస్సుకు నిర్వహణకు శ్రీకారం చుట్టామన్నారు. మేధావులు, సాహిత్య పురస్కార గ్రహీతలు సైతం ఈ సదస్సుకు హాజరవుతున్నట్లు తెలిపారు. 'తెలుగునాటక రంగం-స్త్రీవాదంపై తమ కలాలతో, గళాలతో జనచైతన్యం చేసే దిశగా సదస్సులు కొనసాగుతాయన్నారు. 26వ తేదీ ఉదయం 10 గంటలకు స్థానిక వేదిక కార్యాలయంలో కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. 11.30 వరకు ప్రారంభపు సభ ఉంటుందన్నారు. సాహిత్య అకాడమీ తెలుగు సలహాసంఘం సభ్యులు వల్లూరి శివప్రసాద్ స్వాగతోపన్యాసం, కథ, నవలా రచయిత్రి ఓల్గా కీలకోపన్యాసం, వేదిక ప్రధాన కార్యదర్శి జేవి మోహన్ రావు వందన సమర్పణ చేస్తారన్నారు. 11.45 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు మొదటి సదస్సు మొదలవుతుందన్నారు. అంబటి మురళీకృష్ణ అధ్యక్షతన డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు (నాటకం) స్త్రీ చైతన్యం, నిభానుపూడి సుబ్బరాజు (పద్యనాటకం) స్త్రీ అభ్యుదయం, సీహెచ్ సుశీలమ్మ (సంస్కరణోద్యమ నాటకాలు) స్త్రీ చిత్రణపై పత్ర సమర్పణ చేస్తారన్నారు. మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు జరిగే రెండో సదస్సుకు పిన్నమనేని మృత్యుంజయరావు అధ్యక్షత వహిస్తారన్నారు. దేవి (ఆధునిక వీధినాటకం) స్త్రీ వికాసం, నల్లూరి రుక్మిణి (నాటకం పురుషాధికృత- స్త్రీ ఆర్థిక స్వాతంత్ర్యం, జె.కనకదుర్గ (నాటకం) స్త్రీ వైవాహిక సమస్యల చిత్రీకరణపై పత్ర సమర్పణ ఉంటుందన్నారు.

హత్యకేసులో 38 మందికి బెయిల్ మంజూరు

తాడికొండ: తుళ్లూరు మండలం వెలగపూడి గ్రామంలో మరియమ్మ హత్య కేసులో అరెస్టు అయిన 38 మందికి శుక్రవారం బెయిల్ మంజూరైంది. గుంటూరు జిల్లా కోర్టు బెయిల్ మంజూరు చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. బెయిల్‌కు సంబంధించిన ష్యూరిటీలు, ఇతర పత్రాలను సకాలంలో అందజేయని కారణంగా శనివారం వారు ఇంకా విడుదల కాలేదు. సోమవారం పత్రాలన్నీ సకాలంలో సమర్పిస్తే విడుదలయ్యే అవకాశం ఉంది. కాగా ఈ కేసులో 78వ నిందితుడిగా ఉన్న మాజీ ఎంపీ నందిగం సురేష్‌కు ఇంకా బెయిల్ రావాల్సి ఉంది.

ఎన్నారైలకు పూలబాట

- కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్
- సమాజ సేవకు ముందుకు రావాలని పిలుపు



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి చంద్రశేఖర్

తెనాలి: ప్రవాస భారతీయులు స్వదేశంలో సమాజ సేవకు ముందుకు రావాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కోరారు. పార్టీల కతీతంగా మంచి చేస్తామని వచ్చేవారికి తామే దగ్గరుండి పూలబాట వేస్తామని చెప్పారు. తెనాలి రూరల్ మండల గ్రామం నందివెలుగులోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు గత ప్రభుత్వంలో కేటాయించిన నిధులకు తోడు దాతల సహకారంతో పూర్తిచేసిన భవన సముదాయం, అదనపు సౌకర్యాలను శనివారం ప్రారంభించారు. కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పాఠశాల భవనసముదాయాన్ని ప్రారంభించి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఇతర అతిథులు తరగతి గదులను ప్రారంభించారు. సభలో మంత్రి పెమ్మసాని మాట్లాడుతూ పేదవాడిని ప్రపంచానికి పరిచయం చేసేది చదువునని గుర్తు చేశారు. ఎంత చదువుకున్నా సంస్కారం ముఖ్యమన్నారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎంత చేసినా ప్రజల భాగస్వామ్యం ఉంటే అభివృద్ధి పనులు ఎంత సుందరంగా ఉంటాయని చెప్పేందుకు నందివెలుగు హైస్కూలు నిదర్శనమని తెలిపారు. హైస్కూలు నిర్మాణానికి రూ.40 లక్షలకు పైగా విరాళమిచ్చిన దాత ధూళిపాళ్ల సుధాకర్–మాధురి దంపతులు మాట్లాడారు. మరో దాత, తెనాలి డబుల్‌హార్స్ ఎండీ మునగాల మోహన్‌శ్యాం ప్రసాద్, గ్రామ సర్పంచ్ ధూళిపాళ్ల వపన్‌కుమార్, ప్రధానోపాధ్యాయిని శివపార్వతి మాట్లాడారు. కార్యక్రమంలో ఎన్నారై కృష్ణ, నన్నపనేని లింగారావు, వంగా సాంబిరెడ్డి, నన్నపనేని సుధాకర్, విద్యా కమిటీ చైర్మన్ డి.సురేంద్ర, మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, పంచాయతీరాజ్ అధికారి బ్రహ్మయ్య, ఈవూరు రామయ్య, ఎంఈవో మేకల లక్ష్మీనారాయణ, శ్రీనివాసరావు, మేము సైతం టీమ్ సభ్యులు, గ్రామస్తులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి

గుంటూరు వెస్ట్ : జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సమష్టి కృషి చేస్తున్నాయని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్‌ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలో అనేక అభివృద్ధి పనులకు డీపీఆర్‌లు సిద్ధమయ్యాయని తెలిపారు. దీనిలో భాగంగా నందివెలుగు రోడ్డులోని ఫ్లైఓవర్‌కు గతంలో రూ. 10 కోట్లు ఖర్చు పెట్టారని, మళ్లీ అదనంగా రూ. 20 కోట్లు ఉంటే బ్రిడ్జి నిర్మాణం పూర్తవుతుందని చెప్పారు. దీనికి సంబంధించిన వివరాలు రైల్వే అధికారులకు తెలిపామని పేర్కొన్నారు. శ్యామలానగర్ బ్రిడ్జిని రెండు లైనులుగా నిర్మించనున్నామన్నారు. దీంతోపాటు మంగళగిరి, పెదపలకలూరు బ్రిడ్జిల నిర్మాణాలకు కూడా రెండు మూడు వారాల్లో డీపీఆర్‌లు సిద్ధం చేస్తామని వెల్లడించారు. రైల్వే బ్రిడ్జి నిర్మాణాలకు రూ. 110 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు వెల్లడించారు.

దేహదారుఢ్య పరీక్షల్లో 312 మంది అర్హత



పరుగు పందెం పోటీల్లో అభ్యర్థులు



ఛాతీ కొలతను చూస్తున్న పోలీస్ అధికారులు

నగరంపాలెం: కానిస్టేబుళ్ల అభ్యర్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ అన్నారు. నగరంపాలెం పోలీస్ పరేడ్‌మైదానంలో కొనసాగుతున్న దేహ దారుఢ్య పరీక్షలను జిల్లా ఎస్పీ పరిశీలించారు. అభ్యర్థుల ఛాతీ, ఎత్తు కొలతలు, ధ్రువీకరణ పత్రాల పరిశీలన, పరుగు పందెం పోటీల నిర్వహణను జిల్లా ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. 529 మంది అభ్యర్థుల్లో 95 మంది ధ్రువపత్రాలు తేవకపోవడంతో వెనుదిరిగారు. 434 మందికి దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించగా 312 మంది అర్హత సాధించారు. 43 మందిని ఛాతీ, ఎత్తు కొలతలు సరిపోకపోవడంతో తిరస్కరించారు. మిగతా 391 మందికి 1600 మీటర్ల పరుగు పందెం పోటీలు జరగ్గా, 70 మంది అనర్హులుగా ప్రకటించారు. 321 మందికి 100 మీటర్ల పరుగు పందెం పోటీల్లో 170 మంది అర్హత సాధించారు. 319 మందికి లాంగ్ జంప్ పోటీలు చేపట్టగా, వారిలో 311 మంది అర్హత సాధించారు. జిల్లా ఏఎస్పీలు ఏవీ.రమణమూర్తి (పరిపాలన), ఎ.హనుమంతు (ఏఆర్) పర్యవేక్షించారు.

కొండవీడు కొండల్లో మహిళా కేడెట్ల ట్రెక్కింగ్



గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీ ట్రెక్–3 కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు చెందిన మహిళా ఎన్‌సీసీ కేడెట్లు శనివారం కొండవీడు చెక్‌పోస్టు నుంచి చారిత్రక కొండవీడు కోట వరకు ఏడు కిలోమీటర్లు ట్రెక్కింగ్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. గుంటూరు ఎన్‌సీసీ గ్రూప్– 10 ఆంధ్ర గర్ల్స్ బెటాలియన్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎన్‌సీసీ డైరెక్టరేట్ సంయుక్తంగా అఖిల భారత మహిళా ట్రెక్కింగ్–3 పేరుతో శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా తొమ్మిది ఎన్‌సీసీ గ్రూపులకు చెందిన కేడెట్లు ట్రెక్కింగ్‌లో పాల్గొన్నారు. అనంతరం రెడ్డి రాజుల వారసత్వ మ్యూజియాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కొండవీడు కోట చరిత్ర, ప్రాముఖ్యత గురించి సమాచారాన్ని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గుంటూరు ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ కల్నల్ ఎస్.ఎం. చంద్రశేఖర్ మాట్లాడుతూ శారీరక శక్తి పరీక్షతో పాటు చారిత్రక అవగాహన కలిగించేందుకు ఏర్పాటు చేసిన ట్రెక్కింగ్ శిబిరంలో మహిళా కేడెట్లు ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు.

దళితపేటల్లో సమస్యలపై ఆందోళనలు



మాట్లాడుతున్న అప్పారావు

లక్ష్మీపురం: దళితపేటల్లో సమస్యలపై సర్వే చేసి ఈ నెల 25వ తేదీలోపు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వాటి పరిష్కారం కోసం రౌండ్ టేబుల్ సమావేశాలతో పాటు సచివాలయాలు, మండల కార్యాలయాల వద్ద ఆందోళనలు నిర్వహించాలని జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు పిలుపునిచ్చారు. సంఘ కార్యాలయంలో శనివారం జిల్లా అధ్యక్షులు జెట్టి బాలరాజు అధ్యక్షతన విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ నేడు నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగి పేదలకు అందుబాటులో లేకుండా ఉన్నాయన్నారు. రేషన్ షాపుల ద్వారా కందిపప్పు, నిత్యవసర సరుకులను అందజేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పనులను వంద రోజులు కల్పించాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాశం రామారావు మాట్లాడుతూ రాబోయే బడ్జెట్‌లో అయినా ఉపాధి హామీ పనులకు రూ.2 లక్షల కోట్లు కేటాయించి, కూలీలకు కనీస వేతనం రూ. 6 వందలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహిళా కన్వీనర్ బి. కోటేశ్వరి, నాయకులు జి.అజయ్, కాటమరాజు, మేరి, శివయ్య, నీలాంబరం పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ప్లంబర్ వర్క్‌పై ఉచిత శిక్షణ కల్పించనున్నట్లు జిల్లా స్థాయి పారిశ్రామిక శిక్షణ సంస్థ (డీఎల్‌టీసీ) అసిస్టెంట్ డైరెక్టర్ బి.సాయివర ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు టెన్త్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, ఆధార్‌తో లింకైన మొబైల్ నంబరు వివరాలతో సంప్రదించాలని సూచించారు. ప్లంబర్ కోర్సు ద్వారా అపార్ట్‌మెంట్లు, గృహాల్లో పైప్ ఫిట్టింగ్ ద్వారా స్వయం ఉపాధి అవకాశాలతో పాటు పరిశ్రమల్లో ఉపాధిని పొందవచ్చని తెలిపారు. వివరాలకు 80746 07278, 83339 73929 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

సంక్షేమ పాలనకు బాటలు వేసిన ఎన్టీఆర్



ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించిన హెనీ క్రిస్టినా, ఉద్యోగులు

గుంటూరు ఎడ్యుకేషన్: సంక్షేమ పరిపాలనకు బాటలు వేసి ఎన్టీఆర్ స్ఫూర్తిదాయకంగా నిలిచారని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పేర్కొన్నారు. శనివారం మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా జెడ్పీ క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెనీ క్రిస్టినా మాట్లాడుతూ మహానాయకుడిని భావితరాలు ఆదర్శంగా తీసుకోవాలని క్రిస్టినా సూచించారు.